ఈనాడు

తూర్పుగోదావరి

శనివారం 25 ఆగస్టు 2018 16 పేజీలు


# సాంకేతికతతో వైద్యంలో అద్భుత ఫలితాలు

గాంధీనగర్(కాకినాడ), న్యూస్‌టుడే: రోగికి వచ్చిన జబ్బును కనుక్కోవడం, పరిష్కరించడం ఇరవై ఏళ్ల క్రితమైతే కష్టమయ్యేది, ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇది చాలా సులభమైందని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపేషనల్ హెల్త్ (ఎన్ఐఓహెచ్) డైరెక్టర్ డాక్టర్ కమలేష్ సర్కార్ అన్నారు. ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్, సేఫ్టీ, టెక్నాలజీస్ అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు కాకినాడ జేఎన్‌టీయూలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని జేఎన్‌టీయూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ డైరక్టరేట్, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్, రీసెర్చ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్ఐఓహెచ్ డైరెక్టర్ కమలేష్ సర్కార్ హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా జిల్లా ఎస్పీ విశాల్ గున్ని, కాకినాడ కెఎస్‌పీఎల్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి ఎం.మురళీధర్, ఇండియా కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి సైంటిస్టు బి.రవిచంద్రన్, ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ సభ్యురాలు ఎస్.సురేఖ, ఫార్మసీ కోర్సుల ప్రోగ్రాం డైరక్టర్ ఎస్‌వీయూఎం ప్రసాద్‌లు పాల్గొన్నారు. ప్రత్యేక అతిథులు విశాల్ గున్నీ, వర్సిటీ రెక్టార్ పూర్ణానందంలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమలేష్ సర్కార్ మాట్లాడుతూ ఆధునిక వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులతో సాంకేతిక ఉపయోగిత ఎంతో అత్యవసరమైందన్నారు. బయోమెడికల్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీతో వైద్య వృత్తి సులభదాయకమైందన్నారు. భవిష్యత్తులో జీన్ రీప్లేస్‌మెంట్, స్టెమ్ సెల్ థెరపీ ద్వారా ముందుగానే రోగాలను కనిపెట్టి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవచ్చన్నారు. వైద్యం, సాంకేతికతను రెండింటినీ సమీకృతం చేయగలిగితే వైద్య రంగంలో ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. రెక్టార్ పూర్ణానందం మాట్లాడుతూ పరిశ్రమల్లో కార్మికుల భద్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వర్సిటీలో ఆక్యుపేషనల్ హెల్త్, సేఫ్టీ కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ విశాల్ గున్ని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇటువంటి సదస్సులకు హాజరై ఆరోగ్యం, భద్రతపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఎటువంటి విపత్తు జరిగినా ముందుగా స్పందించేది పోలీసు అధికారులేనని, ప్రతి ఒక్కరూ సహకరించి ప్రాణ, ఆస్థి నష్టాన్ని నివారించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రోగ్రాం డైరెక్టర్లు, అధ్యాపకులు, , స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కమలేష్ సర్కార్